సాక్షి తిరుపతి

సోమవారం, 28, జూలై, 2025



గాల్లో దీపంలా కార్మికుల భద్రత

కార్మికుల భద్రతలో యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. - 8లో



నింగికి సిద్ధంగా 'నిసార్'

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి 30న నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సమాయత్తం అయ్యారు. - 8లో



ఫుట్‌బాల్ విజేత అనంతపురం

అంతర్ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-15 బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. - 8లో

న్యూస్‌రీల్

నూతన ఎస్‌ఐలకు దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో నిజాయితీగా వుండాలని, బాధితులకు న్యాయం చేయడంలో అలసత్వం వహించరాదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రొబేషనర్ ఎస్‌ఐలకు సూచించారు. పోలీసు గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తిరుపతి జిల్లాకు 36 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలను కేటాయించిందని తెలిపారు. వారిలో కర్నూలు రేంజ్ నుంచి 32 మంది, గుంటూరు నుంచి నలుగురు ఉన్నాయని పేర్కొన్నారు. వారిలో 21 మంది ఎస్‌ఐలు, 15 మంది ఉమెన్ ఎస్‌ఐలు ఉన్నారని వివరించారు. విధి నిర్వహణలో సవాళ్లను అధిగమించి ముందుకు వెళ్లాలని, ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ప్రతిభ చాటాలని తెలిపారు. పోలీసు శాఖలో హోం గార్డు నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు అందరూ ఒకటేనని, ప్రతి ఒక్కరినీ గౌరవించాలన్నారు. ఉన్నతాధికారులతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ, కింద స్థాయి సిబ్బందిని కలుపుకుంటూ పనిచేయాలన్నారు.

ముగిసిన క్యాన్సర్ గ్రిడ్ వార్షిక సమావేశం



ముగింపు సమావేశానికి హాజరైన అధికారులు, వైద్యనిపుణులు

తిరుపతి తుడా: స్థానిక జూపార్క్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(స్విమ్స్‌కార్)లో రెండు రోజుల పాటు కొనసాగిన జాతీయ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ స్టేట్ చాప్టర్ 3వ వార్షిక సమావేశం ఆదివారం ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన వార్షిక సమావేశానికి ఆన్‌లైన్ ద్వారా ఏపీ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, రాష్ట్ర వ్యాప్తంగా కాన్సర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. క్యాన్సర్ గుర్తింపు, నివారణ, నాణ్యమైన చికిత్స, పరిశోధనలను ప్రోత్సహించడం, వైద్యులకు అధునాతన చికిత్సలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టాటా మెమోరియల్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సీఎస్ ప్రమేష్, డాక్టర్ కైలాష్ శర్మ, డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, దినేశ్ కుమార్‌లు, వైద్యనిపుణులు, డాక్టర్లు పాల్గొన్నారు.

బాలసదనంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని బాలసదనంలో అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ప్రతిపాదికన ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బాలసదనం సూపరింటెండెంట్ తెలిపారు. కుక్-2 పోస్టులు, హెల్పర్, హెల్పర్ కం నైట్‌వాచ్‌మెన్-2, హౌస్ కీపర్-1 ఆర్ట్ అండ్ క్రాఫ్టకు మ్యూజిక్ టీచర్-1, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9000106774 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శ్రీవారిసేవలో సీఎస్



రాష్ట్ర సీఎస్ కె.విజయానంద్‌కు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను ఈవో జె.శ్యామలరావు అందజేశారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీవారి దర్శనానంతరం టీటీడీ చైర్మన్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి, చైర్మన్ బీ.ఆర్.నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల టీటీడీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన సీఎస్‌కు వివరించారు. అనంతరం ఆయన తిరుచానూరులోని శ్రీ పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్లాస్టిక్‌మయం.. వ్యాధుల భయం

మార్కెట్‌లో పలు రకాల డిజైన్లతో విద్యార్థులను ఆకర్షిస్తున్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు



నిద్రలేచింది మొదలు పడుకునే వరకు ప్రతి వస్తువు ప్లాస్టిక్‌తో చేసిన వాటినే అందరూ వినియోగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే అధికంగా వాడుతున్నారు. వేడి వేడిగా పెట్టిన ఆహారం ప్లాస్టిక్ బాక్స్‌ల్లో పెట్టిన కొన్ని గంటలకే రసాయనాలు ఆహారంలో కలిసి క్యాన్సర్ మహమ్మారికి దారితీస్తున్నాయి. ఇంత ప్రమాదకరమని తెలిసినా ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే కొనుగోలు చేసి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడంలో జిల్లాలోని విద్యా, వైద్యశాఖలు విఫలమవుతున్నాయి.



ప్లాస్టిక్ లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లతో ప్రమాదం

- ప్లాస్టిక్ బాటిళ్లను 90 శాతం విద్యార్థులు ఉపయోగిస్తున్న వైనం
- ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్సుల వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు
- అవగాహన కల్పించడంలో విద్య, వైద్యశాఖ విఫలం
- మొక్కుబడిగా తల్లిదండ్రుల సమావేశాలు
- చైతన్యం చేయాలంటున్న నిపుణులు

తిరుపతి సిటీ : రంగు రంగుల డిజైన్లు, కార్టూన్ క్యారెక్టర్స్, గ్లిట్టర్ ఎఫెక్ట్స్‌తో పిల్లలను ఆకట్టుకునే విధంగా ప్లాస్టిక్ బాటిళ్లు, లంచ్ బాక్స్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ప్రతి విద్యార్థి బ్యాగుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లు దర్శనమిస్తున్నాయి. పాఠశాల, కళాశాలల విద్యార్థులను తమ వైపు తిప్పుకునే విధంగా ఆకర్షణీయంగా ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. వీటి అమ్మకాలు ఊహించని స్థాయికి చేరుకున్నాయి. పలు రకాల వెరైటీలు, తక్కువ ధర, బరువు తక్కువగా కనిపించే ప్లాస్టిక్ బాటిళ్ల వైపే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆకర్షితులై ప్రాణాంతకమైన రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. అనారోగ్యం, పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసినా విద్యావంతులు, ఉన్నత వర్గాలు సైతం వీటి వినియోగాన్ని వదలకపోవడం గమనార్హం.

ప్లాస్టిక్ వినియోగం మనిషి జీవితంలో భాగమైపోయింది. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, పెద్దలు విధులకు హాజరు కావాలన్నా టిఫిన్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ అన్నీ ప్లాస్టిక్‌వే వాడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం ప్లాస్టిక్ బాక్సులలో ప్యాక్ చేసిన ఆహారం మధ్యాహ్నం పిల్లలు భోజనం చేసే సమయానికి ఆహారంలో చాలా తేడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

రసాయనాలు కరిగి విషపూరితం

ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, లంచ్ బాక్సులతో ప్రమాదమని తెలిసినా మార్కెట్‌లో దొరికే పలు రకాల డిజైన్లు చూసి విద్యార్థులు అటు తల్లిదండ్రులు మోజుపడి కొనుగోలు చేసి వాడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేస్తే రోగాలను కొనుగోలు చేసినట్టేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరిగించిన వాటర్‌ను, అత్యంత శీతలమైన పదార్థాలను ప్లాస్టిక్ పాత్రలలో నింపితే సుమారు 90శాతం కెమికల్స్ అందులో కరిగి ఆ పదార్థాలను విషపూరితం చేస్తాయి. దీంతో రోగాలు శరీరాన్ని కబళిస్తాయి. అలాగే ప్లాస్టిక్ బాటిళ్ల వ్యర్థాలు భూమిలో కరగాలంటే కనీసం 450 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటి వినియోగం ఆరోగ్యానికే కాక పర్యావరణానికి ప్రమాదకరం. పాఠశాలలు, కళాశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సామాజిక వేత్తలు, ప్రభుత్వ అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు



ప్లాస్టిక్‌లో బిస్‌ఫినాల్-ఏ (బీపీఏ), మైక్రో ప్లాస్టిక్స్ అనే రసాయనం అధికంగా ఉండటంతో కొద్ది మోతాదులోనైనా శరీరంలో చేరే ప్రమాదం ఉంది. దీంతో హార్మోన్ల సమతుల్యతను దెబ్బ తీస్తుంది. శరీరంలోని గ్రంథులపై ప్రభావం చూపి వాటి పనితీరును మందగిస్తుంది. జీర్ణ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. అతిశీతలం, అధిక వేడి పదార్థాల కోసం వీటిని వినియోగిస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ మహమ్మారి కాటేసే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌ను ఇలానే వినియోగిస్తే 2030 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 27 శాతం మంది క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు, మేధావుల గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ప్రధానంగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 25 ఏళ్ల లోపు పిల్లలు, యువతలోనూ ప్లాస్టిక్ వినియోగించడంతో కలిగే అనర్థాలు ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తున్నాయి. గత 10 ఏళ్ల నుంచి రోజు రోజుకు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం అధికమవడమే ఇందుకు ప్రధాన కారణంగా వైద్యులు సూచిస్తున్నారు.



మార్కెట్‌లో ప్లాస్టిక్ లంచ్ బాక్సుల హల్‌చల్




చిన్నారుల కోసం చేసిన వాటర్ బాటిళ్లు

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి



పిల్లలకు టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్ల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి లేదంటే ప్రమాదమే. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచడం ద్వారా రుచి, వాసన కోల్పోవడంతో పాటు కొన్ని రకాల విష పదార్థాలు ఏర్పడతాయి. ఇవి చిన్నారుల అవయవాలపై ప్రభావం చూపుతాయి. నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉండే వాటర్ బాటిళ్లు, లంచ్ బ్లాక్సులు వాడటంతో అందులోని కెమికల్స్ పొరలుగా ఆహారంలో కలిసి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. - డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, తిరుపతి

పేరెంట్స్ మీటింగ్‌ల్లో అవగాహన కల్పించాలి



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో పేరెంట్స్ మీటింగ్‌లంటూ హడావుడి చేస్తుంటారు. కానీ అందులో విద్యార్థులకు అవసరమైన విషయాలను తల్లిదండ్రులతో చర్చించడం లేదు. తల్లిదండ్రులకు గేమ్స్ ఏర్పాటు చేసి, టీలు, కాఫీలు ఇచ్చి సంతోషపెట్టి పంపుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై యాజమాన్యాలు శ్రద్ధ చూపకపోవడం ఆశ్చర్యమేస్తోంది. పిల్లల ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని, నివారణా చర్యలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలేదు. విద్య, వైద్య శాఖాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. - రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ అధ్యాపకులు, తిరుపతి

స్టీలు, రాగి వస్తువుల వినియోగం శ్రేయస్కరం



ఆధునిక యువత, చిన్నారుల ఆరోగ్యం పెను ప్రమాదంలో పడింది. నిద్రలేచిన మొదలు పడుకునే వరకు ప్రతి వస్తువు ప్లాస్టిక్‌తో చేసిన వాటినే వినియోగిస్తున్నారు. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు దీర్ఘకాలిక సమస్యల చిన్న వయస్సు నుంచే వెంటాడుతున్నాయి. ప్లాస్టిక్ బాక్సులలో ఆహారం భద్రపరిచి కొన్ని గంటల తర్వాత విద్యార్థులు ఆరగించడంతో అదికాస్త విషంగా మారుతోంది. దీంతో జీర్ణాశయం, రక్తనాళాలలు, పేగులు, కిడ్నీలపై విష పదార్థాలు దాడి చేస్తున్నాయి. పలు పరిశోధనలలో ఈ విషయం బయటపడినా తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం దారుణం. పిల్లలకు రాగి, స్టీల్ వంటి వస్తువులను లంచ్ బాక్సులకు, తాగునీటికి వినియోగించడం శ్రేయస్కరం. - ప్రశాంతి, ప్లాస్టిక్ వినియోగం-అనర్థాలపై పరిశోధన చేస్తున్న విద్యార్థిని, తిరుపతి

క్యాన్సర్ విజృంభించే ప్రమాదం



సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకు ప్లాస్టిక్ భూతం చుట్టుముట్టింది. ఇది ప్రమాదకర సంకేతం. తల్లిదండ్రులు చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పూర్వీకులు పాటించిన నియమాలు, అలవాట్లలో ఎంతో రహస్యాలు దాగి ఉన్నాయి. వాటిని నేటి తరం అనుసరించాలి. ప్లాస్టిక్ బాటిళ్లు, లంచ్ బాక్సుల వినియోగంతో కాన్సర్ మహమ్మారి దగ్గరవుతోంది. దీన్ని నుంచి బయట పడాలంటే ప్లాస్టిక్ వస్తువులను పిల్లలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పరంగా పలు రకాలుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య వంతులను చేయడం జరిగింది. - కే. భానుప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి, తిరుపతి

కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సూచనలు చేస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

వాకాడు : మండలంలోని దుగ్గరాజపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా ఆయన స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నిఘా సేవలపై ఆరా తీశారు. దేశ భద్రతలో భాగంగా కోస్టల్ సెక్యూ రిటీ సేవలు మరింత విస్తృతం చేస్తూ తీరం వెంట నిఘా ఉంచాలన్నారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అంజిరెడ్డి, సౌమ్య, ఏఎస్ఐ నాగయ్య ఉన్నారు.

అమానుషంగా ప్రవర్తించిన పీడీ సస్పెన్షన్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా కోట బాలికల ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న ఎస్‌కే మాబాషా అలియాస్ సుబాన్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న సమారు 70మంది విద్యార్థినులు యూనిఫామ్‌తో రాలేదని పీడీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఒక్కొక్కరి వద్ద 150 గుంజీలు తీయించడంతో విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారు. దీంతో ఆగ్రహించిన డీఈఓ ఘటనపై ప్రధానోపాధ్యాయురాలు సమాచారం అందించడంలో విఫలమయ్యారంటూ ఆమెకు సైతం షోకాజు నోటీలు జారీచేశారు.

అధికారుల విచారణ

కోట : కోటలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయకులు సందర్శించారు. బాలికలతో మాట్లాడి వారిపై జరిగిన దాడిని ఖండించారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు. బాలికలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌పై కేసు నమోదు చేస్తామన్నారు. పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు వసతిగృహంలో విచారణ జరిపారు.

అయ్యో.. బాబూ!

- ఉమ్మడి చిత్తూరులో అయ్యోర్లకు జీతాల సమస్య
- పొజిషన్ ఐడీ లేక అయోమయం
- రెండు నెలలుగా అవస్థలు



చిత్తూరు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన యూటీఎఫ్ జిల్లా నేతలు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 4,737 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, నగర పాలక, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 18,540 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నిర్వహించిన బదిలీల కసరత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 7 వేల మంది టీచర్లను బదిలీ చేశారు. అదేవిధంగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు 800 వరకు ఉన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన పలు కేడర్ల టీచర్లు రెండు నెలలుగా జీతాలు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీతాల కోసం నిత్యం డీఈవో కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని విద్యాశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

పొజిషన్ ఐడీ పేరుతో కక్ష

పొజిషన్ ఐడీ పేరుతో టీచర్ల పట్ల కూటమి ప్రభుత్వం జీతాలు మంజూరు చేయకుండా కక్ష సాధింపులకు దిగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెరపైకి పొజిషన్ ఐడీ పేరును తీసుకొచ్చింది. ఏదో ఒక విధంగా టీచర్లను ఇబ్బందులు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

కేబినెట్ ఆమోదం అవసరమట

పొజిషన్ ఐడీలకు కేబినెట్ ఆమోదం అవసరమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఉపాధ్యాయ సంఘ నేతలు మండిపడుతున్నారు. కేబినెట్ ఆమోదం పేరుతో జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించడం సబబు కాదని హెచ్చరిస్తున్నారు. అసలు పొజిషన్ ఐడీల ఫైల్ కేబినెట్‌లో ఆమోదం పొందిందో...లేదో అనే విషయం తెలియడం లేదని, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల మంది టీచర్లు జీతాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. పెండింగ్ జీతాల బిల్లులు పెట్టుకునేందుకు ఈ నెల 27 వరకు రాష్ట్ర ట్రెజరీ అధికారులు అవకాశం కల్పించారని, అయితే పొజిషన్ ఐడీలు లేకపోవడంతో టీచర్లు బిల్లులు నమోదు చేయలేక మిన్నకుంటున్నట్టు తెలిపారు.

అయ్యోర్ల నిరసన


జీతాల కోసం ఉపాధ్యాయులు శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనకు దిగారు. వేతనాల సమస్యను వెంటనే పరిష్కరించాలని రోడ్డెక్కారు. బదిలీలు చేపట్టి రెండు నెలలు కావొస్తున్నా పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. తాజాగా కేబినెట్ భేటీ నిర్వహించినప్పటికీ అందులో పొజిషన్ ఐడీల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.



నగరిలో యూటీఎఫ్ నేతల నిరసన (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బదిలీల సమాచారం

యాజమాన్యం	ఖాళీలు
ప్రభుత్వ	125
ఎంపీపీ/ జెడ్పీ	1,583
మున్సిపల్ కార్పొరేషన్	135
మున్సిపల్	75
5/8 ఏళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్లు	3,000
మిగిలు పోస్టులు	500
రీ అపోర్షన్/షిఫ్టెడ్	1,582
మొత్తం	7,000



జీతాలపై వాట్సాప్ గ్రూపుల్లో టీచర్ల మెసేజ్‌లు

పొజిషన్ ఐడీలు మంజూరు చేయాలి



పొజిషన్ ఐడీలు ఇచ్చేందుకు నెలల సమయం అవుతుందా..?. టీచర్ల పట్ల ఇంత చులకన భావన ఎందుకో. రెండు నెలల జీతాలు లేకపోవడంతో టీచర్లు అవస్థలు పడుతున్నారు. కేడర్ స్ట్రెంత్ నివేదికలు సిద్ధం చేసి పొజిషన్ ఐడీలు ఇవ్వడం పట్ల అలసత్వం వహించడం దారుణం. ఉద్దేశ పూర్వకంగా చేస్తున్నారని అనిపిస్తోంది. - జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

అన్యాయం



పొజిషన్ ఐడీలు ఇవ్వకుండా ఆలస్యం చేయడం అన్యాయం. నెలల తరబడి ఐడీల పేరుతో జీతాలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదు. ఈ సమస్య రాష్ట్ర మొత్తం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది టీచర్లు పొజిషన్ ఐడీ సమస్యతో రెండు నెలల జీతాలు పొందలేకపోయారు. పలు మార్లు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అలసత్వం వహించడం సబబు కాదు. - బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న గ్రీవెన్స్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఆయా విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

క్లుప్తంగా

తిరుమలలో మాజీ ఉపరాష్ట్రపతి



వెంకయ్య నాయుడుకి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల : భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, టీటీడీ చైర్మన్ బీ.ఆర్ నాయుడుతో కలిసి ఆదివారం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో ముచ్చటించారు. అన్నప్రసాదాలు రుచికరంగా, శుభ్రంగా ఉన్నాయని భక్తులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ అందిస్తున్న అన్నప్రసాదం ఎంతో శుచిగా, రుచిగా ఉందని తెలిపారు. శ్రీవారి సేవకులుగా భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ సహ భక్తులకు సేవలందించడం ఆనందదాయకమైన విషయమని తెలియజేశారు. దీనికి ముందు తిరుమల చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలింత మృతి

చిల్లకూరు : మండలంలోని తిమ్మనగారిపాళెం లోని గిరిజన కాలనీకి చెందిన కుడుముల మీనా (25) పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల మేరకు మీనా మూడోసారి గర్భిణిగా ఉండగా నెలలు నిండడంతో గూడూరులోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యులు ఆమెకు సీజేరియన్ చేసి పండంటి మగ్గబిడ్డను బయటకు తీశారు. అయితే ఆ సమయంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను వైద్యులు, సిబ్బంది, 108 వాహనంలో నెల్లూరులోని సర్వజన ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అయినప్పటికి ఆమెకు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారి, ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అటు తరువాత ఆమె మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముగ్గురు చిన్న బిడ్డలను పెట్టుకుని ఎలా జీవించాలని ఆమె భర్త కుడుముల అంకయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. బాలింత మృతి చెందడంపై చిల్లకూరు వైద్యుడు అరాఫత్‌ను వివరణ కోరగా మీనా మరణంపై పూర్తి స్థాయి నివేదిక వచ్చిన తరువాతే విషయం తెలుస్తుందన్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పారిశ్రామిక వాడలోని క్రోమో మెడికేర్ కంపెనీలో ఈనెల 14వ తేదీ రియాక్టర్ పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు కార్మికులకు చెన్నై ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం అందిస్తుండగా చిట్టమూరు మండలానికి చెందిన వెంకటేష్ శనివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం బంధువులకు మృతదేహాన్ని అప్పగించినట్లు గాజుల మండ్యం పోలీసులు తెలిపారు. మరో కార్మికుడు రవీంద్ర పరిస్థితి విషమంగా ఉందనే సమాచారం.

నింగికి సిద్ధంగా నిసార్



షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై సిద్ధం చేసిన జీఎస్ ఎల్‌వీ ఎఫ్16 ఉపగ్రహ వాహక నౌక

షార్ నుంచి ఈనెల 30న జీఎస్ఎల్‌వీ ఎఫ్16 నుంచి నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా నేడు ఎంఆర్ఆర్ సమావేశంలో చర్చించిన అనంతరం ప్రయోగం కౌంట్ డౌన్ సమయాన్ని నిర్దేశించనున్నారు. ఈ ప్రయోగాన్ని నాసా–ఇస్రో సంయుక్తంగా నిసార్ రూపొందించారు. ఈ ప్రయోగంతో భూమికి అత్యంత దగ్గరగా పరిశీలించే వెసులుబాటు కలగనుంది.

మొదటిసారిగా నాసాతో సంయుక్తంగా..

ఇస్రో–నాసా మొట్ట మొదటిసారి ఉమ్మడిగా నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని (నిసార్) రూపొందించారు. ఇది ప్రత్యేకమైన భూమి పరిశీలన ఉపగ్రహం కావడం విశేషం. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపార్చర్ రాడార్ (నాసాది ఎల్–బ్యాండ్, ఇస్రోది ఎస్–బ్యాండ్) భూమిని అత్యంత దగ్గరగా పరిశీలించే ఉపగ్రహం కావడం విశేషం. ఈ ప్రయోగానికి సంబంధించి నేడు ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం కౌంట్ డౌన్ సమయాన్ని, ప్రయోగ సమయాన్ని అధికారికంగా నిర్ణయిస్తారు. ముందుగా ప్రకటించిన సమయం కంటే కొద్దిగా మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంటుంది.

- ఈనెల 30న జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ నుంచి ప్రయోగం
- 29న కౌంట్‌డౌన్ ప్రక్రియకు సన్నాహాలు
- నేడు ఎంఆర్ఆర్ సమావేశం

సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈనెల 30న సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ ద్వారా 2,392 కిలోల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగ సమయానికి 25 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ ఉపగ్రహాన్ని 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య–సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు.

మూడు దశల్లో జీఎస్ఎల్‌వీ ఎఫ్16 ప్రయోగం

పీఎస్ఎల్‌వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్‌వీ రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. 51.7 మీటర్లు పొడవు ఉన్న జీఎస్ఎల్‌వీ ఎఫ్ 16 రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలు దేరుతుంది. ఈ ప్రయోగంలో 2,392 కిలోలు బరువు గల నిసార్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 4 గంటలకు రాకెట్‌ను వ్యాబ్ నుంచి ప్రయోగ వేదిక మీదకు నెమ్మదిగా తరలించే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్‌ను దశల వారీగా అనుసంధానించే దృశ్య మాలిక ఇది. జీఎస్ఎల్‌వీ మార్క్2 సిరీస్‌లో 18వ ప్రయోగం కావడం విశేషం. షార్ కేంద్రం నుంచి 102వ ప్రయోగం కావడం విశేషం.



జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ వ్యాబ్‌లో విద్యుత్ లైట్లు కాంతిలో ధగధగలాడుతున్న దృశ్యం



జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్‌ను ప్రయోగవేదిక మీద అనుసంధానం చేసేందుకు తరలిస్తున్న దృశ్యం

మొదటి దశ ఇలా



జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ మొదటి దశను అమర్చుతున్న దృశ్యం

కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. రాకెట్‌కు చుట్టూ నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లుకు కలిపి 170.7 టన్నుల ద్రవ ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు.

రెండో దశ ప్రక్రియ



రెండోదశ రాకెట్ అనుసంధానంలో భాగంగా ద్రవ ఇంధనం దశను అమర్చుతున్న దృశ్యం

రెండో దశలో 42.1 ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ దశలో ఇంధనాన్ని కౌంట్ డౌన్ సమయంలోనే నింపే ప్రక్రియను చేపడతారు.

మూడో దశ ఇలా



రాకెట్‌కు మూడో దశలో క్రయోజనిక్ దశను అమర్చుతున్న దృశ్యం

మూడో దశను మహేంద్రగిరిలోని ఇస్రో ప్రపోల్షన్ సెంటర్‌లో రూపొందించి, అందులో 14.5 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని నింపి మూడో దశను పూర్తి చేస్తారు. ఈ దశకు పైభాగంలోనే ఉపగ్రహాన్ని అమర్చుతారు.

పీడీపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం డిమాండ్



వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న అశ్విత్‌రెడ్డి

కోట : కోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలికలపై జరిగిన దాడి ఘటన సమాజం సిగ్గుపడేలా చేసిందని, ఈ దారుణానికి బాధ్యుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌ను విధుల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్విత్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం ఎస్సీ బాలికల వసతి గృహానికి విచ్చేసి జరిగిన సంఘటనపై బాలికలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూనిఫామ్ వేసుకురాలేదనే కారణంతో ఒక్కొక్కరి చేత 120 గుంజిళ్లు తీయించాడని, గుంజిళ్లు తీయని వారిని బెత్తంతో కొట్టారని, బాలికలు తమ సామాజిక సమస్యలు ఉన్నాయని ప్రాధేయపడ్డా కనికరించలేదని వాపోయారు. గుండెల్లో నొప్పిగా ఉందని ఒక బాలిక కాళ్లు పట్టుకున్నా వినలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అశ్విత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ బాలికలపై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి పీఈటీతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గారా వంశీ, మధు, సన్నీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ గూడూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎంబేటి గిరి, మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర, పెంచలయ్య, రాజేష్ పాల్గొన్నారు.

పీడీపై కేసు నమోదు

కోట బాలికల జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ అలియాస్ మాబాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థినులకు యూనిఫామ్‌లో హాజరు కాని కారణంగా గుంజిళ్లు తీయించి అస్వస్థతకు కారణమయ్యారు. బాధిత కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలులో నుంచి జారిపడి కానిస్టేబుల్ మృతి



అశోక్ మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ గీతా కుమారి, సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ

వెంకటగిరి రూరల్ : రైలులో నుంచి జారి పడి కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు డక్కిలి మండలం సంగనపల్లి గ్రామానికి చెందిన సద్దికూటి అశోక్ (33) వెంకటగిరి పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వెంకటగిరిలో విధులకు హాజరయ్యేందుకు గూడూరు- వెంకటగిరి మార్గంలోని రైల్లో వస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు రైల్వేపోలీసులు తెలియజేశారు.

అశోక్ మృతదేహానికి డీఎస్పీ నివాళి

వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అశోక్ అంత్యక్రియల్లో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సీఐ ఏవీ రమణ, ఎస్సైలు, పోలీసులు పాల్గొని అశోక్ మృతదేహానికి నివాళి అర్పించారు.

నిమ్మ..కన్నీటి చెమ్మ!

- ఆక్రమణల పేరుతో నిమ్మ చెట్ల తొలగింపు
- లబోదిబోమంటున్న గిరిజనులు
- అధికారుల తీరుపై దుమ్మెత్తి పోస్తున్న ప్రజలు

సైదాపురం మండలం, గద్దలతిప్ప వద్ద సర్వే నం.793లో నలుగురు పేదలు సాగు చేసుకుంటున్న సుమారు 500 నిమ్మ చెట్లను అధికారులు తొలగించేశారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు సంఘాల నాయకులు అధికారుల తీరును ఎండగడుతున్నారు. 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నా పట్టించుకోని అధికారులు.. ఇప్పుడు కూటమి నేతలకు కట్టబెట్టేలా చర్యలు చేపడుతున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆక్రమణ పేరుతో నిమ్మ చెట్లు తొలగించేశారని మండిపడుతున్నారు. ఈ దౌర్జన్యం ఇంకా ఎంతకాలం..? అంటూ నిలదీస్తున్నారు. – సైదాపురం



జేసీబీతో నిమ్మ చెట్లను తొలగిస్తున్న అధికారులు



బాధిత రైతులను పరామర్శించేందుకు వస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాలిన నిమ్మకాయలు

ఫుట్‌బాల్ విజేతగా అనంతపురం జట్టు



విజేతగా నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ అందించిన నిర్వాహకులు

నాయుడుపేటటౌన్ : అంతర్ జిల్లా స్థాయిలో నాయుడుపేట పట్టణంలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో అండర్–15 జూనియర్ బాలికల విభాగంలో ఆదివారం జరిగిన ఫుట్‌బాల్ ఫైనల్స్ పోటీలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఫుట్‌బాల్ కమిటీ ఆధ్వర్యంలో అండర్–15 బాలికల విభాగంలో అంతర్ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి 9 జోన్ల పరిధిలోని 15కు పైగా జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు పోటీలు జరగగా ఫైనల్ పోటీలో అనంతపురం, వైఎస్సార్ కడప జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. విన్నర్స్‌గా అనంతపురం, రన్నర్స్‌గా వైఎస్సార్ కడప జిల్లా జట్లు నిలిచినట్లు తెలిపారు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జట్టు మూడో స్థానంలో నిలిచింది. ట్రోఫీల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. బాలికలు విద్యతో పాటు క్రీడల్లో మేటిగా రాణిం చాలని సూచించారు. ఫుట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న జాతీయస్థాయి క్రీడాకారులు, కోచ్ గౌస్‌బాషతో పాటు నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు ఎంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విన్నర్స్, రన్నర్స్‌తో పాటు మూడో స్థానంలో నిలిచిన జట్లుకు ట్రోఫీలను అందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టును సైతం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రెడ్డిప్ప, చర్చి పీసీసీ చైర్మన్ కారల్ మధు, బీజే ప్రసాద్, కళాచంద్, ఆనంద్, ఎస్ఎఫ్‌సీకు చెందిన కాళహస్తి భావిన్ అనుదీప్, టైసన్, రాఫీ, ఏలిష, సిరాజ్, భాను విజయ్ పాల్గొన్నారు.

గాల్లో దీపంలా కార్మికుల భద్రత

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో కార్మికుల తరలింపు
- కనీస భద్రతా ప్రమాణాలు పాటించని వైనం

వరదయ్యపాళెం: కార్మికుల భద్రత గాల్లో దీపంలా మారింది. బతుకు పోరాటంలో రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి వలస కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిపై పరిశ్రమ యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు వారి భద్రత విషయంలో డొల్లతనాన్ని చూపుతున్నారు. వారు నివాసముండే ప్రాంతాల నుంచి పరిశ్రమల వద్దకు లారీల్లో పశువుల కన్నా హీనంగా కార్మికులను తరలించడమే భద్రతా వైఫల్యానికి పరాకాష్ట. ఆ దిశగా చిన్న పాండూరు ఏపీఐఐసీ సెజ్‌లో అపోలో, మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అయితే ఆ పరిశ్రమల్లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిర్మాణ కూలీలు పనిచేస్తున్నారు. రోజువారీ పరిశ్రమలకు పనుల నిమిత్తం వారిని తీసుకెళ్లే వాహనాల్లో కనీస భద్రతా ప్రమాణాలు లేవు. ఒకే లారీలో వందల మందిని తరలించడం, అది కూడా లారీలో ఒకరిపై ఒకరు నిలబడుకునే దుస్థితి నెలకొంది. రవాణా సమయంలో జరగరానిది జరిగితే వారి ప్రాణాలు గాల్లో దీపమే అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నిర్మాణ కూలీలను తీసుకువచ్చే కాంట్రాక్టర్లు వారి భద్రత విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిద్రావస్థలో రవాణా శాఖ

అయితే అటు శ్రీసిటీ, ఇటు చిన్న పాండూరు, మాదనపాళెం ప్రాంతాల్లో ఏపీఐఐసీ సెజ్‌లు ఉన్నాయి. వందలాదిగా పరిశ్రమలు ఈ ప్రాంతంలో నెలకొలాపరు. రోజువారీ వేలల్లో కార్మికులను తరలించేందుకు వందలాది వాహనాలు ఈ ప్రాంతంలో రోజువారీ వెళ్తుంటాయి. మరి ఆ వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అన్న విషయాలను పర్యవేక్షించాల్సిన రాష్ట్ర రవాణా శాఖ నిద్రావస్థలో ఉంది. ఆ వాహనదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. అంతేకాక కాలం చెల్లిన బస్సులు, మినీ వాహనాల్లో కార్మికులను తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవల్సిన పరిస్థితి ఉంది.

నేటి నుంచి రెండో విడత వెబ్‌ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ ప్రవేశాలలో భాగంగా సోమవారం నుంచి రెండో విడత వెబ్‌ఆప్షన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎస్వీయూ పరిధిలో ఇప్పటికే తొలి విడతలో 60 శాతం సీట్లు భర్తీ కాగా రెండో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం నుంచి మూడు రోజులు పాటు కొనసాగనుంది. వచ్చే నెల ఒకటో తేదీన వెబ్ ఆప్షన్ మార్పునకు అవకాశం ఇస్తూ సాంకేతిక విద్యాశాఖ మండలి నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 4వ తేదీన రెండో విడత సీట్ల కేటాయింపు ప్రక్రియను విడుదల చేయనుంది.